క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న పిచ్చిమొక్కలను మంగళవారం ఫ్రంట్ బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగించివేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వర్షం నీరు ఇళ్లలోకి, రోడ్లపైకి రాకుండా వరద కాలువను గుర్తించి కాలువల్లోని సిల్ట్‌ను పూర్తిగా తొలగించేలా చర్యలు చేపట్టారు. 9వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు నాగరాజు, సాయి, జమున, శానిటేషన్ సిబ్బంది శ్రవణ్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మృతిపై అధికారుల విచారణ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మంథనిరూరల్: మంథని మండలం సిరిపురం సమీపంలోని గోదావరి నది ఒడ్డున సోమవారం సాయంత్రం పిడుగుపాటుతో పుట్ట పోచయ్యకు చెందిన 30గొర్రెలు మృతి చెందిన ఘటనపై తహసీల్దార్ కుమారస్వామి మంగళవారం విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని ఆర్ఐ అనిల్‌రెడ్డి, పశువైద్యాధికారి రవికుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేశారు. గొర్రెల మృతిపై విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేసి ప్రభుత్వం ద్వారా పరిహారం అందించేలా కృషి చేస్తానని తహశీల్దార్ బాధితులకు భరోసా ఇచ్చారు. అధికారులతో పాటు యాదవ సంఘం నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

మంథని: మండలంలోని చిల్లపల్లి గ్రామానికి చెందిన పుట్ట పోచయ్య, సంతోష్‌కు చెందిన 36 గొర్రెలు పిడుగుపాటుతో మృత్యువాత పడ్డాయని, ఆ కుటుంబాలను ఆదుకోవాలని యాదవ సంఘం నాయకులు కోరారు. మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేశ్‌కు మంగళవారం వారు వినతిపత్రం అందించారు. గొర్రెల మృతితో రూ.3లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. అంతేగాకుండా గొర్ల కాపరి పోచయ్య స్వల్పంగా గాయపడ్డాయన్నారు. మంథని యాదవ సంఘం అధ్యక్షుడు పర్సవేన మోహన్, నాయకులు కనవేన శ్రీనివాస్, జాగిరి సదానందం, కనవేన కొమురయ్య, సింగనవేన మల్లేశ్, బోగొండ రవి, మాదరవేన ఓదెలు ఉన్నారు.

గుడిపల్లిలో వన మహోత్సవం



మొక్క నాటుతున్న ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్

పాలకుర్తి: మండల పరిధిలోని గుడిపల్లిలో అబ్కారీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ పాల్గొని గ్రామంలోని చెరువుకట్టపై గౌడ కులస్తులతో కలిసి ఖర్జూర మొక్కలు నాటారు. ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఉపాధిహామీ మండల ఏపీఎం కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామ గౌడ సంఘం ప్రెసిడెంట్ లింగయ్య, వైస్ ప్రెసిడెంట్ స్వామి, శ్రీనివాస్‌గౌడ్, అంజయ్య, మల్లేశ్, ఎక్సైజ్ సిబ్బంది ప్రసాద్, ఖదీర్, శ్రావణ్, రాజు, రాజ్‌కుమార్, గీత పాల్గొన్నారు.

ఇంటికో ఇంకుడుగుంత తప్పనిసరి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రజలు తమ ఇళ్లలో ఇంకుడుగుంత తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ సూచించారు. కొత్తగా ఇల్లు నిర్మించుకునే యజమానులు నిర్మాణ సమయంలోనే ఇంకుడుగుంత కూడా నిర్మించాల్సిందేనన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని, వర్షం నీరు వృథాగా పోదని వివరించారు. టీపీవో నరేశ్, టీపీఎస్ వినయ్ ఉన్నారు.

నామినేటెడ్ పదవులపై ఆశలు

- మారిన రిజర్వేషన్లు.. ఆశావహుల్లో నిరాశ
- సామాజిక వర్గాల వారీగా కేటాయింపులు



మంథని: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ కొద్ది దూరంలోనే ఉండడంతో అంతకు ముందే నామినేటెడ్ పదవులు అప్పగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం సమాయత్తమైనట్లు సమాచారం. నాలుగు రోజుల క్రితమే మంథని నియోజకవర్గంలోని మహదేవపూర్ మండలానికి చెందిన కోట రాజబాపునకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి దక్కింది. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, పార్టీ అధ్యక్ష, ఇతర అనుబంధ సంఘాలకు నూతన కార్యవర్గాలను నియమించే అవకాశం ఉంది.

మారిన రిజర్వేషన్లు

నియోజకవర్గంలో మంథని, రామగిరి, కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలతో పాటు కాళేశ్వరం దేవస్థాన కమిటీ, మంథని మహాలక్ష్మీ, లక్ష్మీనారాయణస్వామి, గౌతమేశ్వర తదితర ముఖ్యమైన ఆలయ కమిటీల చైర్మన్లతోపాటు పాలకవర్గ కమిటీలను నియమించే అవకాశం ఉంది. కాగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలకు గతంలో అనుకున్న రిజర్వేషన్లకు భిన్నంగా.. ప్రస్తుతం నెలకొన్న పోటీతోపాటు ఇతర సమీకరణాల దృష్ట్యా కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు మార్చినట్లు కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతోంది.

సర్దుబాటులో బుజ్జగింపులు

చైర్మన్‌గిరీ కోసం కొన్నేళ్లుగా ఆశపడుతున్న కాంగ్రెస్ నాయకులకు రిజర్వేషన్ల మార్పుతో పదవులు వచ్చే అవకాశం లేదని, ఇలాంటి వారికి స్థానిక, సింగిల్ విండో పదవుల ద్వారా అవకాశం కల్పించేలా బుజ్జగిస్తున్నారని సమాచారం. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనిసమయంలో పార్టీని పట్టుకొని ఎవరు పనిచేశారు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వేళ పార్టీ శ్రేణులు పనిచేసిన తీరు ఎలా ఉందనే దానిపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు, టీసీపీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు వద్ద కచ్చితమైన సమాచారం ఉందని తెలిసింది. దీంతో పార్టీ శ్రేణుల్లో వణుకుమొదలైనట్లు సమాచారం. పని తీరు ఆధారంగా పదవుల కేటాయింపు ఉంటుందనే సమాచారంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఏదిఏమైనా వారంలోపు నామినేటెడ్, పార్టీ పదవులు కేటాయిస్తారనే చర్చ జోరుగా సాగుతోంది. దీంతో ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

నిరుపేదలకు ఉచితంగా ఫంక్షన్‌హాల్



మాట్లాడుతున్న చందర్

గోదావరిఖని: నగరంలోని తిలక్‌నగర్‌లోని విశ్వం ఫంక్షన్‌హాల్‌ను తెలంగాణ కమ్యూనిటీ భవన్‌గా మార్చి ఈనెల 24 నుంచి నిరుపేదల ఫంక్షన్లకు ఉచితంగా ఇవ్వనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. స్థానిక తిలక్‌నగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గిఫ్ట్ ఏ స్మైల్ కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కేటీఆర్ జన్మదినాన్ని 24న నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరం, అన్నదానం, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత సరోజిని, పాముకుంట్ల భాస్కర్, నాయకులు గోపు ఐలయ్యయాదవ్, బొడ్డు రవీందర్, మెతుకు దేవరాజు, అచ్చే వేణు, నూతి తిరుపతి, జిట్టవేన ప్రశాంత్, చెలుకలపల్లి శ్రీనివాస్, మారుతి, దొమ్మేటి వాసు, బొడ్డుపల్లి శ్రీనివాస్, స్టాలిన్‌గౌడ్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు



అరెస్ట్ చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిందితుని అరెస్ట్ చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గతనెల 29న స్థానిక మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామిని కించపర్చేలా రామగుండం జనహిత, పాలకుర్తి మండలం, నిజం నిప్పులాంటిది అనే మూడు ఫేస్‌బుక్ అకౌంట్లను క్రియేట్ చేసి అందులో పోస్ట్ చేశాడని వివరించారు. టెక్నాలజీ సాయంతో ఆ సోషల్ మీడియా గ్రూపులను క్రియేట్ చేసిన రామగుండం ఎస్టీకాలనీకి చెందిన జరుపుల శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి సెల్‌ఫోన్ సీజ్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఒక సామాజిక వర్గం, రాజకీయ పార్టీలు, వ్యక్తిగతంగా కించపర్చినట్లు పోస్టు చేసినా, ఫార్వర్డ్ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

సామాజిక సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యం



ఎల్ఈడీ బల్బులు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్: ప్రజలకు సామాజిక సేవలందించడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని కమాన్‌పూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అన్నారు. గుమ్మడి అంజయ్య ఆర్థిక సహకారంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని రొంపికుంట, సిద్దిపల్లె, నాగారం గ్రామపంచాయతీలకు మంగళవారం 200 ఎల్ఈడీ వీధి బల్బులు అందజేశారు. ఆగస్టు 4న రొంపికుంటలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, ఏవో రామకృష్ణ, లింగమూర్తి, అనవేన లక్ష్మీరాజం, బండ సాయిశంకర్, మాటేటి కుమార్, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, అన్నపూర్ణ, రాంమోహన్, కారోబార్లు రమేశ్, సతీశ్, సాకేత్ పటేల్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• జీవనజ్యోతి మహిళా కమిటీ ఏర్పాటు

జూలపల్లి: మండల కేంద్రంలో జీవనజ్యోతి మహిళా నూతన కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షురాలుగా ఆవుల నీలమ్మ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా మల్లెత్తుల పద్మ, కార్యదర్శిగా స్నేహ, సహాయ కార్యదర్శిగా రజిత, కోశాధికారిగా దాడి పద్మ, సభ్యులుగా మారం కొమురవ్వ, ఆవుల లక్ష్మి, సలీమా, రజియా, హేమలత, యశోద, సుల్తాన్, పోచమ్మ ఎన్నికయ్యారు. నీలమ్మ అధ్యక్షతన కమిటీ మొదటి సమావేశం నిర్వహించగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పొలగాని సతీశ్, మేర శ్రీనివాస్, కోడూరి మహేశ్, బండి రాజిరెడ్డి తదితరులు పాలొన్నారు.

• రేపు ఆలయభూమి కౌలుకు వేలం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలోని శ్రీలక్ష్మినర్సింహస్వామి ఆలయానికి చెందిన సర్వే నెంబరు 283లోని 8.20ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చేందుకు 24న (గురువారం) వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య తెలిపారు. సంవత్సర కాలానికి నిర్వహిస్తున్న ఈ వేలంలో పాల్గొనేవారు రూ.20వేల ధరావత్ చెల్లించి పాల్గొనాలన్నారు. వివరాలకు 98482 06779 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

• నేడు రాజరాజేశ్వర ఆలయంలో నందీశ్వరునికి అభిషేకం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని నందీశ్వరునికి సాయంత్రం ప్రదోషకాల పూజ, పంచామృతలతో అభిషేకం, సుగంధద్రవ్యాలతో అభిషేకం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు కర్నె అశోక్ శర్మ తెలిపారు.

• క్రీడా ప్రాంగణంలో రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి క్రీడా ప్రాంగణంలో 400మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన ఛత్రపతి శివాజీ మహరాజ్ యూత్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలెక్టర్‌కు, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

• తాత్కాలిక రోడ్డుకు మరమ్మతు

ముత్తారం: మండలంలోని ఓడేడు-గరిమిళ్లపల్లి మానేరుపై తెగిన తాత్కాలిక రోడ్డుకు మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు మరమ్మతు చేయించారు. సోమవారం రాత్రి మానేరు ఉధృతికి తాత్కాలిక మట్టి రోడ్డు తెగిపోగా రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న నాయకులు మరమ్మతు చేయించారు.

• విద్యార్థి సంఘాల బంద్ పిలుపునకు టీపీటీఎఫ్ మద్దతు

గోదావరిఖనిటౌన్: ప్రైవేట్ టీచర్స్ ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త పాఠశాలలు, కళాశాలల బంద్‌కు ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల రాజేశ్ యాదవ్ కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు 23న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు ప్రైవేట్ టీచర్స్ జిల్లా ఫోరం పూర్తి మద్దతు తెలుపుతూ, ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్స్ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

• పారిశుధ్య కార్మికురాలిపై కుక్క దాడి

కోల్‌సిటీ: గోదావరిఖనిలో మంగళవారం పారిశుధ్య కార్మికురాలు పద్మపై కుక్క దాడి చేసి గాయపర్చింది. స్థానిక హనుమాన్‌నగర్‌లో విధినిర్వహణలో భాగంగా నడుచుకుంటూ వస్తున్న పద్మపై శునకం దాడి చేసి కాలును కొరికింది. దీంతో బాధితురాలు భయంతో వణికిపోయింది. స్థానికులు బెదరగొట్టడంతో కుక్క అక్కడి నుంచి పారిపోయింది. చికిత్స కోసం జీజీహెచ్ ఆస్పత్రికి తరలించగా, బాధితురాలిని శానిటరీ సూపర్‌వైజర్ యూసుఫ్ పరామర్శించారు.

• పీఆర్సీలు, డీఏ వెంటనే విడుదల చేయాలి

జూలపల్లి: ఉపాధ్యాయులకు పీఆర్సీతో పాటు డీఏ విడుదల చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు వనపర్తి అంజయ్య కోరారు. మండల కేంద్రంతో పాటు నాగులపల్లె ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభించి రశీదులు అందజేశారు. సంఘం నాయకులు కొండవేని జగన్, శ్రీనివాస్‌రెడ్డి, మండల బాధ్యులు నాగరాజు పాల్గొన్నారు.

• అదుపు తప్పిన లారీ

మంథనిరూరల్: మంథని మండలం ఎగ్లాస్‌పూర్ శివారులోని గాదుదలగండి గుట్టపై అదుపుతప్పిన లారీ రైలింగ్‌పైకి దూసుకెళ్లింది. భూపాలపల్లి నుంచి మంథని వైపు వస్తున్న టిప్పర్ లారీ సోమవారం రాత్రి సమయంలో అదుపుతప్పి గుట్ట చివరన ఉన్న రైలింగ్ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. వెంటనే జేసీబీ సాయంతో లారీని రైలింగ్‌పై నుంచి బయటకు తీశారు.

రోడ్లపై చెత్త వేయొద్దు



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: రోడ్లపై చెత్త వేయొద్దని, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు చెత్త అప్పగించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి కోరారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఫైవింక్లయిన్ చౌరస్తాలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, చెత్త రీసైక్లింగ్, కుక్కకాటు బారిన పడకుండా కాపాడుకోవడం అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక మల్కాపూర్ రోడ్డులో ముళ్లచెట్లు, పొదలు తొలగించారు. విఠల్‌నగర్‌లో మరుగుదొడ్డి పరిశీలించి ఆవరణ పరిశుభ్రం చేయించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎంఈవో విజయ్‌కుమార్

కమాన్‌పూర్: ప్రతీఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలని మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో డెల్టా క్యాబ్స్ సీఈవో సంతోష్ గుప్తా ఆదేశాల మేరకు దీపం గ్లోబల్ ఫౌండర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాలకు పంపిణీ చేసిన మొక్కలను మంగళవారం పాఠశాల ఆవరణలో నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గసిగంటి రమేశ్, రాజేశ్వరరావు, రజిత, రేణుక పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న శివ

సుల్తానాబాద్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అయిందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ రాజోజుల శివ ఆరోపించారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పలు ప్రాజెక్టులపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, సీఎం రేవంత్‌రెడ్డి లోపయకారీ ఒప్పందంతోనే ప్రాజెక్టుల్లో జలదోపిడీ జరుగుతోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే నోటిఫికేషన్లు ఇచ్చిన వాటినే భర్తీ చేశారని, రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కర్రె దేవేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు, ఉప్పు శివకుమార్, పోసాని సాయి, రామకృష్ణ, సాయి,కుమార్, గాజుల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల వేడుకలు



బోనాల వేడుకల్లో విద్యార్థులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గాయత్రి పాఠశాలలో ఆషాఢ మాసం బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. బాలికలు బోనాలతో గ్రామంలోని బస్టాండు వరకు నిర్వహించిన ర్యాలీ, బాలుర పోతురాజు వేషధారణతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర పద్మాకర్‌రాజు, హెడ్‌మాస్టర్ ఎర్ర శ్రీలత పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

గనులపై కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషించే కార్మికులకు గనులపై కనీస సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్జీ-1 ఏరియా జీడీకే-11వ గని కార్మికులను మంగళవారం కలిసి సౌకర్యాలు తెలుసుకున్నారు. కార్మికుల వస్తువులు భద్రపర్చడానికి లాకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. కోతుల సంచారంతో కార్మికులు భయాందోళన మధ్య భోజనాలు చేయాల్సి వస్తోందన్నారు. తక్షణమే సేఫ్టీ లాకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. కోల్ ఇండియాలో జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికులకు నాణ్యత గల డ్రెస్ కోసం రూ.12,500 ఇప్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో కార్మికుల సమస్యలపై పలు ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని పేర్కొన్నారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, బొగ్గారం శ్రీనివాసరావు, జంగాపల్లి మల్లేశ్, మునుకుంట్ల రామన్న, సీహెచ్ దేవేందర్, మహేందర్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆర్జీ–1 ఏరియాలో క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 ఏరియాలో మంగళవారం క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. రీజియన్‌లో విధులు నిర్వహిస్తున్న కేటగిరీ వన్ నుంచి కేటగిరీ-6 వరకు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్సీఓఏ క్లబ్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డీ, టీటూ, ఎండీ, ఎస్‌టీ టూ, టైప్ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా 327 క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించగా అర్హత, గ్రేడ్‌ను బట్టి కేటాయించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సీనియర్ పీవో హనుమంతరావు, జీడుల శ్రీనివాస్, సంక్షేమ అధికారి నిహాల్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సాయినాథ్ పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో కౌన్సెలింగ్..

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 పరిధిలో క్వార్టర్ల కౌన్సెలింగ్ మంగళవారం నిర్వహించారు. సీఈఆర్ క్లబ్‌లో ఇంతవరకు క్వార్టర్‌లేని ఆర్జీ-3, ఏపీఏ ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సెలింగ్ చేపట్టారు. 972 క్వార్టర్లకు గాను 113 ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 54మంది హాజరయ్యారు. అందులో 33మంది ఉద్యోగులు క్వార్టర్లు తీసుకున్నారని వెల్లడించారు. కౌన్సెలింగ్‌లో ఇంచార్జి ఎస్ఓటూ జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీఓ సదన్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ పాల్గొన్నారు.

ఢిల్లీ సెమినార్‌కు చంద్రమౌళి ఎంపిక



చంద్రమౌళి

గోదావరిఖని: న్యూఢిల్లీలో వచ్చేనెల 7న జరిగే సోషల్ జస్టిస్ సెమినార్‌కు జీడీకే-5 ఓసీపీ సర్వే అధికారి, సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి చంద్రమౌళికి ఆహ్వానం అందింది. ఈమేరకు ఆలిండియా అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏఐఓబీసీ)నుంచి లేఖ పంపించారు.

ఘనంగా జాతీయ పతాక ఆమోద దినోత్సవం ర్యాలీ



సుల్తానాబాద్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



గోదావరిఖనిటౌన్: ర్యాలీలో లయన్స్‌క్లబ్ సభ్యులు



జూలపల్లి: ర్యాలీలో విద్యార్థులు

సుల్తానాబాద్: పట్టణంలో జాతీయ పతాక ఆమోద దినోత్సవం ర్యాలీని విద్యార్థులు, యువత ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్, శ్రీవాణి డిగ్రీ కళాశాల, విజ్ఞాన్ హైస్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ జిల్లా మాజీ చైర్మన్ హనుమండ్ల రాజిరెడ్డి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు 100మీటర్ల భారీ త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని పట్టణంలోని పోలీస్‌స్టేషన్, రాజీవ్ రహదారి మీదుగా మున్సిపల్ కార్యాలయం గుండా ర్యాలీ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావు, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా హంగర్ రిలీఫ్ కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పూసాల సాంబమూర్తి, సీనియర్ సభ్యులు గజబీంకర్ జగన్, పిట్టల వెంకటేశం, చకిలం వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి, రామగుండం రీజియన్ పలు క్లబ్‌ల ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మోర బద్రేశం, లయన్స్‌క్లబ్ రీజినల్ చైర్మన్ కుజాంపురం రాజేందర్, జోన్ చైర్మన్ నార్ల ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీధర్, సెక్రటరీ కొల్లూరి విజేందర్, ట్రెజరర్ కొలిపాక సతీశ్, సభ్యులు శేగంటి నరేశ్, బంక రామస్వామి, జయప్రకాశ్ చౌడ, కోదాటి ప్రవీణ్, ఎస్.గోపాల్‌రావు, సురేశ్ పటేల్, జ్యోతిరాం, శేగంటి విక్రమ్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలో జాతీయ పతాక ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక జూపిటర్ ఉన్నత విద్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులు 150 మీటర్ల జాతీయ పతాకాన్ని గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ అందె కుమార్, ఏఎస్ఐ లక్ష్మీనారాయణ, పీసీ పవన్, టీచర్లు పాల్గొన్నారు.

ఇటుకబట్టీ యజమానిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ: బాలకార్మికులతో పనిచేయిస్తున్న జనగామ శివారులోని శ్రీలక్ష్మి బ్రిక్స్ ఇండస్ట్రీ యజమానిపై మంగళవారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ ముస్కాన్ - 11లో భాగంగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీకాంత్, సోషల్ వర్కర్ శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్ వైజర్ సంతోష్, ఎస్సై దివ్య, హెడ్‌కానిస్టేబుల్ సదయ్య, కానిస్టేబుళ్లు వంశీకృష్ణ, శ్వేత జనగామ శివారులోని శ్రీలక్ష్మి బ్రిక్స్ ఇండస్ట్రీలో మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ బాలుడు(16) పనిచేస్తున్నట్లు కనిపించాడు. దీంతో బాలకార్మిక చట్టాన్ని ఉల్లంఘించిన ఇటుకబట్టీ యజమాని సుధాకర్‌రెడ్డిపై వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

గణిత బోధకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రామగుండం: పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో పీజీటీ గణితం బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన, హవర్లీ బేస్‌లో విధులు నిర్వర్తించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పంబాల సదానందంయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9-12వ తరగతి వరకు గణిత సబ్జెక్టు బోధించేందుకు సామర్థ్యం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హతలు ఎమ్మెస్సీ(గణితం), బీఎడ్ తప్పనిసరిగా ఉండాలి. ప్రతీనెల గౌరవ వేతనం రూ.18వేల వరకు ఉంటుంది. ఈ నెల 23తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుండగా ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కళాశాలకు వెళ్లి వివరాలు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తుదారులు 24న బోధన తీరుతెన్నులను పరిశీలించనున్న క్రమంలో అభ్యర్థులు డెమో క్లాస్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.